నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
8 సోమవారం 2 జూన్ 2025 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD





నస్పూర్ చెరువులో కనువిందు చేస్తున్న వలస పక్షులు

# పత్తి రైతుపై విత్తన భారం

ఈ యేడాది పెరిగిన విత్తనాల ధరలు

● గతేడాదితో పోలిస్తే రూ. 50 అదనం ● ఆందోళనలో అన్నదాతలు ● రైతు భరోసా అందక అవస్థలు



పత్తి సాగు విస్తీర్ణం
**3.35** లక్షల ఎకరాలు

కావాల్సిన విత్తన ప్యాకెట్లు
**6,70,726**

ఒక్కో ప్యాకెట్ ధర
**864**

ప్రస్తుతం పెరిగిన ధరతో కలిపి
**910**

రైతుపై పడుతున్న భారం
**2.60** కోట్లు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): యేటేటా పత్తి విత్తనాల ధరలు పెరుగుతుండగా, రైతులకు శాపంగా మారుతున్నది. గతేడాది సాధారణ పత్తి విత్తనాల ప్యాకెట్‌కు రూ.864 ఉండగా, ఈ యేడాది అదనంగా రూ. 40 నుంచి రూ. 50 దాకా పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. జిల్లాకు మొత్తం 6,70,726 ప్యాకెట్లు అవసరముండగా, ప్రస్తుతం పెరిగిన ధరతో పోలిస్తే కర్షకలోకంపై రూ. 2.60 కోట్లకు పైగా భారం పడుతున్నది.

**3.35 లక్షల ఎకరాల్లో సాగు..**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా పత్తి పంటను సాగు చేస్తుంటారు. గతేడాది 3.30 లక్షల ఎకరాల్లో పత్తి వేయగా, ఈ యేడాది 3,35,363 ఎకరాల్లో సాగుచేస్తున్నట్లు వ్యవసాయశాఖ చెబుతున్నది. ఇందుకు 6,70,726 విత్తనాల ప్యాకెట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నది. ఇక సీజన్ ప్రారంభమైందంటే చాలు అనేక కంపెనీల పేర్లతో వందలాది రకాల విత్తనాలు మార్కెట్లోకి వస్తుంటాయి. ఇందులో నకిలీవేవో.. అసలివేవో తెలియని పరిస్థితి ఉంటుంది. ప్రధానంగా మార్కెట్‌లో బీటీ-1, బీటీ-2 రకాలు అందుబాటులో ఉంటుండగా, రైతులు ఎక్కువగా బీటీ-2 రకాలే కొనుగోలు చేస్తుంటారు. డిమాండ్ ఉన్న విత్తనాలను ఎక్కువ ధరలకు విక్రయిస్తుంటారు. లేదంటే పత్తి విత్తనాల కోసం వచ్చే రైతులకు ఒకటీ.. రెండు ప్యాకెట్లకే పరిమితం చేస్తుంటారు. అనేక కంపెనీలు పలు రకాల విత్తనాలను అందుబాటులో ఉంచినప్పటికీ రైతులు మొగ్గుచూపే బ్రాండ్లకే ధరలు పెరుగుతున్నాయి.

**రైతులపై రూ.2.60 కోట్లకు పైగా భారం**

ఈ యేడాది 3,35,363 ఎకరాల్లో పత్తి సాగుచేస్తుండగా, ఇందుకు 6,70,726 విత్తనాల ప్యాకెట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణ పత్తి విత్తనాలకు రూ. 40 నుంచి రూ. 50 దాకా ధర పెరగగా (బ్రాండెడ్ పత్తి విత్తనాలకు రూ. 100 నుంచి రూ. 300 వరకు), ఈ లెక్కన రూ. 2.60 కోట్లకు పైగా భారం రైతులపై పడనున్నది. గతేడాది సాధారణ రకం పత్తి విత్తనాల ప్యాకెట్‌కు రూ. 864 ఉంటే.. ఈ ఏడాది రూ. 900 నుంచి రూ. 910 వరకు చేరింది.

**పెట్టుబడి సాయం అందక అవస్థలు**

బీఆర్‌ఎస్ సర్కారులో రైతుబంధు పథకం ద్వారా ఏడాదికి ఎకరానికి రూ. 10 వేల పెట్టుబడి సాయం అందేది. జిల్లాలోని సుమారు లక్షా 31 వేల మంది రైతులకు పెట్టుబడి సాయం కింద దాదాపు రూ. 210 కోట్ల 30 లక్షలు అందించేవారు. వానకాలం పంటలతో పాటు యాసంగి సాగు సమయానికల్లా పెట్టుబడి సాయం అందించడం వల్ల రైతులు రంది లేకుంట పంటలు సాగు చేసుకునేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడి (రైతుభరోసా) సాయం అందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. పెట్టుబడి కోసం మళ్లీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొన్నది.

**పత్తి ధరల పట్టిక (ప్యాకెట్‌కు)**

| సంవత్సరం | రూపాయలు |
|---|---|
| 2019 | 710 |
| 2020 | 730 |
| 2021 | 767 |
| 2022 | 810 |
| 2023 | 853 |
| 2024 | 864 |
| 2025(వరకు) | 910 |

# కిలకిలల కనువిందు

నస్పూర్ చెరువులో సందడి చేస్తున్న జకానా వలస పక్షులు

*మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నస్పూర్ చెరువులో వలస పక్షులు కిలకిల రావాలతో సందడి చేస్తున్నాయి. శ్రీలంక, ఆస్ట్రేలియా, దక్షిణ జపాన్, హిమాలయాల్లో కనిపించే వందలాది జకానా పక్షులు ఇక్కడికి చేరుకొని కనువిందు చేస్తున్నాయి. అస్సాం రాష్ట్రంలో అత్యధికంగా ఉండే ఈ జాతిని "తెల్ల నీటి యువరాణి" (రాణి దిదావో గోఫిటా) అని పిలుస్తారు. నెమలి తోకను పోలి ఉండే ఈ బర్డ్ శాస్త్రీయ నామం హైడ్రోఫాసియనస్ చిరుర్గస్ అని పక్షి ప్రేమికులు చెబుతున్నారు. పదేళ్ల క్రితం కనిపించిన ఈ అరుదైన పక్షులు, ఈ మధ్య కాలంలో ఇక్కడికి వలస వస్తున్నాయని, ఈ ప్రాంతంలో గుడ్లు పొదిగి పిల్లలు చేసిన తర్వాత వాటితో కలిసి తిరుగుపయనం అవుతాయంటున్నారు. వీటికిఅవసరమైన సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.*

*- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్*



అదనపు కలెక్టర్ దంపతులను సన్మానిస్తున్న మీసేవా నిర్వాహకులు

## అదనపు కలెక్టర్ దంపతులకు సన్మానం

మంచిర్యాలటౌన్, జూన్ 1: మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేసి మే 31న ఉద్యోగ విరమణ పొందిన సభావత్ మోతీలాల్ దంపతులను జిల్లా మీ సేవ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. శనివారం రాత్రి కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మోతీలాల్ దంపతులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. జిల్లాకు ఆయన అందించిన సేవలను కొనియాడారు.


## బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు

సీసీసీ నస్పూర్, జూన్ 1: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని ఆ పార్టీ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నస్పూర్‌లోని మంచిర్యాల జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ చేపట్టి, అమరవీరులకు నివాళులర్పిస్తామని పేర్కొన్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, చెన్నూర్ నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్, రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు హాజరవుతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.












నీటి కోసం బోర్‌వెల్ చుట్టూ బిందెలతో గుమిగూడిన ఆదివాసులు

## పోరుగడ్డలో నీటి పాట్లు

● ఆరు రోజులుగా సరఫరా కాని మిషన్ భగీరథ జలం
● గొంతు తడుపుకునేందుకు బోర్‌వెల్ వద్ద గంటల తరబడి నిరీక్షణ
● అధికారులు స్పందించాలని ఆదివాసుల వేడుకోలు

*కుమ్రం భీం పోరుగడ్డ అయిన జోడేఘాట్‌లో ప్రజానీకం తాగు నీటికి పడరాని పాట్లు పడుతున్నది. ఆరు రోజులుగా 'మిషన్ భగీరథ' నీటి సరఫరా నిలిపివేయడంతో గొంతు తడుపుకునేందుకు వేట సాగించాల్సి వస్తున్నది. ఇక్కడ ఒకే ఒక్క బోర్‌వెల్ ఉండగా, అందులో భూగర్భ జలాలు అడుగంటడంతో ఆదివాసులు గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొన్నది. బిందెడు నీటి కోసం పనులన్నీ వదులుకొని ఉదయం నుంచి పడిగాపులు కాయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం.. నిర్వహణ లోపంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇకనైనా స్పందించి తాగు నీరు సరఫరా చేయాలని వారు వేడుకుంటున్నారు.*

*- కెరమెరి, జూన్ 1*



బిందెలతో నీళ్లు మోసుకెళ్తున్న జోడేఘాట్ ప్రజలు

# సింగరేణి ప్రగతిలో భాగస్వాములవ్వాలి

● సీఎండీ బలరామ్ ● ఎస్సీ,ఎస్టీ, బీసీ లైసెన్ ఆఫీసర్లు- ఉద్యోగ సంఘాలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరామ్

శ్రీరాంపూర్, జూన్ 1 : సింగరేణి సంస్థ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని సీఎండీ ఎన్ బలరామ్ కోరారు. శనివారం సాయంత్రం కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం నుంచి తొలిసారిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ చీఫ్ లైసెన్ ఆఫీసర్లు, ఏరియా లైసెన్ ఆఫీసర్లు, ఉద్యోగ సంఘాల నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కంపెనీ ప్రస్తుత ఆర్థిక స్థితిగతులు, భవిష్యత్తు ప్రణాళికలు, బొగ్గు మార్కెట్‌లో సింగరేణి ఎదుర్కొంటున్న సవాళ్లు తదితర అంశాల గురించి వివరించారు, సింగరేణి సంస్థ ముందుకెళ్లాలంటే కార్మిక సంఘాలు కూడా యాజమాన్యానికి పూర్తి సహకారం అందించాలన్నారు. ముఖ్యంగా ఉత్పాదకత బాగా పెరగాల్సి ఉందని, ప్రతి ఉద్యోగీ ఎనిమిది గంటల సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, యంత్రాలను కూడా గరిష్ఠంగా వినియోగించాల్సి ఉందన్నారు. బొగ్గు నాణ్యతా ప్రమాణాలు పెంచాలని, రక్షణతో పని చేయాలని, ఇందుకు కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు తమ పరిధిలోని సభ్యులను చైతన్య పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఏరియాల నుంచి పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ లైసన్ అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ కంపెనీ చేపట్టబోయే విస్తరణ ప్రణాళికలు విజయవంతం కావడానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. అలాగే కంపెనీ ప్రగతికి దోహదపడే పలు కీలక సూచనలు చేశారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగేలా కార్మికులను చైతన్య పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల చీఫ్ లైసెన్ ఆఫీసర్, జీఎం మణుగూరు దుర్గం రాంచందర్, ఎస్టీ ఉద్యోగుల చీఫ్ లైసెన్ ఆఫీసర్, జీఎం ఇల్లందు వీసం కృష్ణయ్య, బీసీ ఉద్యోగుల చీఫ్ లైసెన్ ఆఫీసర్, ఐటీ(హెచ్‌ఓడీ) హరి శంకర్, సంస్థ డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఈడీ సుభాని, జీఎం(సీపీపీ) మనోహర్, జీఎం మార్కెటింగ్ ఎన్‌వీ రాజశేఖర్‌రావు, కార్పొరేట్ జనరల్ మేనేజర్లు, అన్ని ఏరియాల జీఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదమరిస్తే అంతే..!

*సిర్పూర్(టీ) మండలం* మద్దులవాగు సమీపంలోని కౌటాల- సిర్పూర్ ప్రధాన రహదారిలో పెను ప్రమాదం పొంచి ఉన్నది. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే వరద వెళ్లేందుకు మద్దుల వాగు సమీపంలోని ప్రధాన రహదారి కింది నుంచి పైపులైన్ ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువపైనున్న రోడ్డు కోతకు గురవుతూ వచ్చింది. అదే ప్రాంతంలో మట్టి కూలుతూ పెద్ద గుంత ఏర్పడింది. భారీ వానలు పడితే మరింత కోతకు గురై ప్రమాదాలు జరిగేందుకు అవకాశమున్నది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంత ఏర్పడ్డ చోట సిమెంట్ గోడ కట్టిస్తే ప్రయాణికులను రక్షించిన వారవుతారని స్థానికులు చెబుతున్నారు. *- కౌటాల, జూన్ 1*



సిర్పూర్ మండలం మద్దుల వాగు సమీపంలో కోతకు గురైనా ప్రధాన రహదారి